RNI Regd No. 06225/99

## సాహిత్యం వివరాలు

| | | |
|---|---|---|
| 1. | ఐశ్వర్యము యొక్క మానసికస్థితి | 300.00 |
| 2. | శ్రీమహాకాల చక్రవర్తి యంత్ర ధ్యానము | 100.00 |
| 3. | నవ్యయుగావతరణకు ఏకాదశ పుష్పాలు | 140.00 |
| 4. | నవయుగ సాహిత్యము (ప్రజ్ఞావతార కథామృతము) | 180.00 |
| 5. | పరివ్రాజకుల కరదీపిక | 180.00 |
| 6. | యూనివర్సల్ మైండ్ | 130.00 |
| 7. | అమృతత్వ విద్య | 120.00 |
| 8. | నవయుగాన్ని నిర్మించే సావిత్రీ సాధన | 150.00 |
| 9. | ఆణిముత్యాలు (భగవద్గీత ముఖ్యాంశాలు) | 130.00 |
| 10. | ఆత్మకథ | 60.00 |
| 11. | విశిష్ట యోగసాధనలు | 60.00 |
| 12. | అకల్ట్ అనాటమీ, వేదిక్ వాస్తు, అస్ట్రాలజీ, హోమియోపతి | 60.00 |
| 13. | ఆధ్యాత్మిక విద్య లక్ష్యము | 30.00 |
| 14. | త్రిముఖీ గాయత్రీమాత ధ్యానవిధానము | 25.00 |
| 15. | శ్రీసూక్తము | 20.00 |
| 16. | 10 ఆసనాలు - సూర్య నమస్కారాలు | 10.00 |

**ప్రతులకు :**

| | | |
|---|---|---|
| ✧ పి. సీతారాముడు | భీమవరం | 90106 47325 |
| ✧ శ్రీమతి బి. అనూరాధ | రేపల్లె | 90309 80315 |
| ✧ శ్రీమతి కె. సౌజన్య | విశాఖపట్నం | 98858 74477 |
| ✧ శ్రీమతి ఏ.వి. మీనాబాయి | హైదరాబాద్ | 98664 81980 |

భూమి స్వర్గముగా మారటానికి
మానవజాతి సాధించవలసిన
5 లక్ష్యాలు

| | |
|---|---|
| ఒకే శక్తి | - సూర్యకిరణాల శక్తి |
| ఒకే ధర్మము | - దేహములే దేవాలయాలు |
| ఒకే విశ్వము | - ఎల్లలు లేని యుద్ధాలు లేని ప్రపంచము |
| ఒకే భాష | - ప్రేమ, మౌనము |
| ఒకే కరెన్సీ | - ఒకే వినిమయ సాధనము |

# స్వర్ణయుగము

నూతన యుగపు మాసపత్రిక

"వసుధైక కుటుంబకమ్" అనే ఆదర్శము ఇప్పుడు సామూహిక వాదంగా మారి, సమయానుకూలంగా కార్యరూపం దాలుస్తున్నది.

- ఇక ప్రపంచమంతటా ఒకే జాతి మనుగడలో ఉంటుంది. అదే చక్కగా సంస్కరింపబడి సభ్యతను పాటించే మానవజాతి.
- పృథ్వి మొత్తం ఒకే దేశంగా మారుతుంది. దేశాల మధ్య ఏర్పాటైన కృత్రిమమైన అడ్డుగోడలన్నీ ముక్కలై ఎందుకూ పనికిరాకుండా పోతాయి.

రాబోయే సత్యయుగ సమాజ వ్యవస్థకు సంబంధించిన కొన్ని దృశ్యాలివి. ప్రతి ఆస్తికుడికి ఇవి భవిష్యత్తు పట్ల ఆశను కలిగిస్తాయి.

-- పండిత శ్రీరామశర్మ ఆచార్య

రూ. 20.00 మార్చి 2013 87

## సత్యయుగావతరణకు మానవజాతి
## నెరవేర్చవలసిన 18 సత్సంకల్పాలు

సత్యయుగము యొక్క పునరాగమనము మహాకాలుని యొక్క ప్రేరణ ద్వారా ఈనాడు పృథ్వి మీద జరుగుచున్నది. మహాకాలుని యొక్క ఈ ప్రేరణ 18 సత్సంకల్పాలుగా మానవజాతికి అందజేయబడుతోంది.

పూజ్య గురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్య హిందీలో అందజేసిన 18 సత్సంకల్పాల యొక్క వివరణ "21వ శతాబ్దపు శాసన తంత్రము - మన యుగనిర్మాణ యోజన సత్సంకల్పములు" అనే పేరుతో తెలుగులో పుస్తకముగా వెలువడినది. ఈ సంచికలో ఆ వివరణ పాఠకులకు క్లుప్తముగా అందజేయబడుచున్నది. పై పుస్తకమును ఈ దిగువ అడ్రసు నుండి పొందవచ్చును.

గాయత్రీ చేతనా కేంద్రము,
5-283, అశ్వనీ హౌస్ దగ్గర, మూసాపేట, వెల : రూ. 120.00
హైదరాబాద్ -18. ఫోన్ నెం. 99491 11175


సంపుటి - 8 సంచిక - 3

స్వర్ణయుగము మాసపత్రిక
సంవత్సర చందా : రూ. 240.00

ఆంధ్రా బ్యాంక్ ఆన్‌లైన్ ఎకౌంట్ నెం.
00461 00110 20050
IFSC Code : ANDB 0000046

చందా పంపించవలసిన చిరునామా :
పి. సీతారాముడు,
8-2-6/9-1, ప్రశాంతి వీధి,
నర్సయ్య అగ్రహారం,
భీమవరం - 534 201, ప.గో. జిల్లా.
ఫోన్ నెం. : 90106 47325
78421 33860

Printed and Published by P. Sita Ramudu and Printed at Akhanda Gurusatta Printers, Bhimavarm and Published at 8-2-6/9-1, N. Agraharam, Bhimavaram, W.G. Dt., A.P.
Editor : P. Sita Ramudu







ఈ దిగువ పరిజనుల భాగస్వామ్యముతో ఈ సంచిక వెలువడినది

| | |
|---|---|
| శ్రీమతి బి. అనూరాధ | రేపల్లె |
| శ్రీమతి కె. సౌజన్య | విశాఖపట్నం |
| శ్రీ పి. బంగార్రాజు | అంతర్వేదిపాలెం |
| శ్రీ ఎస్. సత్యనారాయణరాజు | భీమవరం |
| శ్రీమతి ఎల్. రాజ్యలక్ష్మి | ఒంగోలు |
| శ్రీమతి ఏ. శోభ | హైదరాబాద్ |
| శ్రీమతి జి. లక్ష్మీకాంతమ్మ | టి.వి. పాలెం |
| శ్రీమతి పి. శైలజ | విజయవాడ |
| శ్రీమతి ఏ. జానకీదేవి | విజయవాడ |
| శ్రీ కె. సత్యనారాయణ | హైదరాబాద్ |

పై పరిజనులు అందరికి హృదయపూర్వక కృతజ్ఞతలు

గురు సీతారామ్

8.3.13 నాటికి స్వర్ణయుగము మాసపత్రిక సభ్యుల సంఖ్య : 139

# సత్య యుగావతరణకు మానవజాతి నెరవేర్చవలసిన 18 సత్సంకల్పాలు

ఓం

1. మేము ఈశ్వరుని సర్వవ్యాపకునిగాను, న్యాయనిర్ణేతగాను అంగీకరించి ఆయన ఆజ్ఞలను మా జీవితాలలో పాటిస్తాము.
2. శరీరాన్ని భగవంతుని ఆలయముగా గుర్తించి, సంయమనము మరియు నియమ పాలన ద్వారా ఆరోగ్యాన్ని రక్షించుకుంటాము.
3. మనస్సును దురాలోచనలు, దుర్వ్యసనాల నుండి రక్షించుకొనుటకై నిరంతరము స్వాధ్యాయ - సత్సంగాలను ఏర్పాటు చేసుకుంటాము.
4. ఇంద్రియ సంయమం, అర్థ సంయమం, సమయ సంయమం మరియు ఆలోచనా సంయమాలను నిరంతరమూ అభ్యసిస్తాము.
5. మమ్ము మేము సమాజము యొక్క అభిన్న అంగముగా గుర్తించుకుని, అందరి హితములోనూ మా హితాన్ని చూసుకొంటాము.
6. మర్యాదలను పాటించి, చేయకూడని పనులను చేయము. పౌర బాధ్యతలను పాటిస్తాము. సమాజం యెడల నిష్ఠను కలిగి ఉంటాము.
7. వివేకము, నిజాయితీ, బాధ్యత మరియు పరాక్రమాలను జీవితం యొక్క అవిచ్ఛిన్నమైన అంగాలుగా గుర్తిస్తాము.
8. నలువైపులా మాధుర్యము, స్వచ్ఛత, సౌజన్యము, నిరాడంబరతతో కూడిన వాతావరణాన్ని నిర్మిస్తాము.



9. అవినీతితో పొందిన సాఫల్యము కంటే నీతి మార్గాన పొందిన పరాజయాన్నే శిరసావహిస్తాము.
10. వ్యక్తి విలువకు గీటురాయి అతని సాఫల్యము, యోగ్యత, అంతస్తులు కాక, అతని సద్భావనలు, సత్కర్మలు అని గుర్తిస్తాము.
11. ఇతరులు మాయెడల ఏ విధంగా ప్రవర్తించాలని కోరుకుంటామో, మేము ఇతరుల యెడ ఆ విధంగానే ప్రవర్తిస్తాము.
12. స్త్రీ పురుషులము పరస్పరము పవిత్ర దృష్టిని కలిగి ఉంటాము.
13. ప్రపంచములో సత్ప్రవృత్తుల పుణ్య ప్రచారము కొరకు మా సమయము, శ్రమ, పలుకుబడి సాధ్యమైనంతగా వెచ్చిస్తాము.
14. సాంప్రదాయాల కంటే వివేకానికి ప్రాముఖ్యతనిస్తాము.
15. సజ్జనులను సంఘటిత పరుచుటలో, అవినీతి యెడల కాఠిన్యత వహించుటలో, సృజనాత్మక కార్యకలాపాలలో పూర్తి ఆసక్తిని కలిగి ఉంటాము.
16. దేశ ఐకమత్యము, సమానతల యెడ శ్రద్ధ చూపుతాము. జాతి, లింగ, భాష, ప్రాంత, సంప్రదాయాల కారణంగా, పరస్పరం ఎలాంటి భేదభావాలను కలిగి ఉండము.
17. మానవుడు తన భాగ్యానికి తానే నిర్మాత!
 ఈ విశ్వాసము ఆధారంగా మేము ఉత్కృష్టులమై, ఇతరులను శ్రేష్టులుగా చేస్తే, యుగం తప్పక మారుతుందని మా విశ్వాసం.
18. "మేము మారతాం - యుగం మారుతుంది. మేము చక్కబడతాం - యుగం చక్కపడుతుంది" ఈ తథ్యముపై సంపూర్ణ విశ్వాసము ఉన్నది.

***

## 1 మేము ఈశ్వరుని సర్వవ్యాపకునిగాను, న్యాయనిర్ణేతగాను అంగీకరించి ఆయన ఆజ్ఞలను మా జీవితాలలో పాటిస్తాము

మానవుడు తన జీవితమును నియమానుసారము క్రమశిక్షణతో తీర్చి దిద్దుకొనుటకు సహాయపడే దృష్టికోణమే "ఆస్తికత".

❋ "మేము భగవానుని బిడ్డలము.

-- పరమ పవిత్రుడైన ఈశ్వరుని కరుణను, సహాయమును పొందాలంటే, మనము ఆయన ఆజ్ఞానుసారము ధర్మపరాయణులుగా జీవించాలి.

-- భగవంతుడు ప్రతి ప్రాణిలోను ఉన్నాడు కనుక మనము అందరితోను స్నేహపూర్వకముగా వ్యవహరించాలి.

-- పాపము చేయడమంటే భగవంతునితో దురుసుగా ప్రవర్తించడమే కనుక పాపము అంటే భయపడాలి."

-- ఇటువంటి భావనలు, విశ్వాసాలను మనస్సులో స్థిరంగా ప్రతిష్ఠించుకొని, తదనుగుణ్యంగా ప్రవర్తనను మార్చుకున్న వ్యక్తియే "ఆస్తికుడు" అని పిలువబడతాడు.

ఈశ్వరునిపై అచంచల విశ్వాసము, అవిచ్ఛిన్నంగా ఆయన సామీప్యము ను అనుభూతి చెందగలిగే స్థితినే "ఆస్తికత" అంటారు.

❋ ఆ స్థితిని పొందేందుకు మనకు ఉన్న సాధనమే "ఉపాసన".

పరమేశ్వరుడు సర్వత్రా వ్యాపించివున్నాడు. ఆ సర్వాంతర్యామికి సూక్ష్మం గా ఉండే విషయాలు కూడా తెలుస్తూనే ఉంటాయి. ఆయనకు సత్కర్మలంటే చాలా ప్రేమ. ఈశ్వర భక్తునిలో ఈ విశ్వాసమే బాగా పెంపొందాలి.



భగవంతుడు భక్తవత్సలుడే కాదు, భయంకర రౌద్రరూపుడు కూడా. అందుకే ఆయన వేసే శిక్షలకు భయపడతాము.

మనం ధ్యానంలో చూడవలసినది చక్కగా పిల్లనగ్రోవి వాయిస్తూ, రాస లీల చేసే శ్రీకృష్ణుడిని మాత్రమే కాదు, త్రిశూలము ధరించి అసురీ శక్తులను మర్దించివేసే ఈశ్వరుని యొక్క మరో రూపం కూడా చూడాలి.

అనేక రోగాలతో పీడితులై, చెవుడు, మూగ, గ్రుడ్డితనములతో బాధింప బడుతూ, కారాగారములు, ఆస్పత్రుల చుట్టూ తిరుగుతూ వ్యథలను అనుభవించే వారిని చూస్తే ఈశ్వరుని రౌద్రరూపము మనకు చక్కగా కనపడుతుంది.

న్యాయనిష్ఠ కలిగిన న్యాయమూర్తి తన బంధువులకు, మిత్రులకు కూడా శిక్షలను, అవి ఉరిశిక్షలైనా, కొరడా దెబ్బలైనా సరే న్యాయంగా అమలు పరుస్తాడు.

అదే విధంగా ఈశ్వరుడు కూడా తన భక్తునికైనా, భక్తుడు కానివానికైనా శుభ, అశుభ కర్మలకు బహుమతులు, దండనలు అనే ఫలితాలను ఇస్తాడు.

అందుచేత నిరంతరం సత్కార్యాలలో నిమగ్నం కాగలిగే ప్రేరణను, సామర్థ్యాన్ని, సాహసాన్ని ప్రసాదించమని భగవంతుని కోరుకుంటూ ఉండాలి.

❋ పాపము పట్ల భయము,
పుణ్యము పట్ల ప్రేమ అనే గుణాలే భగవద్భక్తుని ప్రధాన చిహ్నాలు.

అతడు ప్రాణులు అందరిలోను ఈశ్వరుని దర్శిస్తాడు కనుక అందరితోను ఆత్మీయంగా, ఉదారంగా ప్రవర్తిస్తూ, సేవా, సహకారాలను అందిస్తాడు.

అప్పుడు మానవుడు తమలోనే పరమేశ్వరుని, పరమేశ్వరునిలో తమను చూడగలిగే దివ్యదృష్టిని పొంది, జీవిత లక్ష్యమును చేరుకుంటాడు.

❋✣❋

## 2 శరీరాన్ని భగవంతుని ఆలయముగా గుర్తించి, సంయమనము మరియు నియమ పాలన ద్వారా ఆరోగ్యాన్ని రక్షించుకుంటాము

శరీరము ఈశ్వరుడు నివశించగలిగేంత పవిత్ర స్థానముగా చెప్పబడింది.

అటువంటి శరీరమనే మందిరాన్ని ఇష్టమొచ్చిన అలవాట్లతో రోగాలకు నిలయంగా మార్చడం వల్ల ఎంతో బాధను అనుభవించడం, అల్పాయుష్షు, ఆర్థిక నష్టము మొదలైన అనేక శిక్షలను అనుభవించవలసి వస్తుంది.

మానవ జన్మ ఎన్నో విభూతులు, విశేషతలతో నిండివుంటుంది.

- శరీరము, మనస్సు సంపూర్ణమైన ఆరోగ్యంతో ఉంటేనే మహామానవుల స్థాయికి ఎదగటం సాధ్యమౌతుంది.

అనేక దౌర్భాగ్యాలలో, శాపాలలో మొట్టమొదటిది అనారోగ్యము. అటువంటి పరిస్థితిని తెచ్చుకోకుండా ఉండేందుకే అందరూ ప్రయత్నించాలి.

సృష్టిలోని అన్ని ప్రాణులు జీవన పర్యంతము రోగరహితంగా ఉంటాయి. మానవుని విశృంఖలమైన అలవాట్లే అతనికి రోగాల్ని తెచ్చిపెడతాయి.

- కొంతమంది నాలుకకు ఉన్న వాపిరితనం వల్ల తినకూడని పదార్థాలను ఎక్కువగా తినేసి బాధపడుతూవుంటారు. మోయలేని భారం ఎత్తుకుంటే ఎవరైనా చతికిల పడిపోతారు. అదే విధంగా పొట్ట కూడా అందులో మనం వేసిన పదార్థాలను అరగించలేక బాధపడుతూ ఉంటుంది. అలా అరగని పదార్థమంతా కుళ్ళి రక్తంలో కలిసిపోయి రోగంగా మారుతుంది.
- -- కాముకతపై ఉండే తృష్ణ వల్ల జీవనీ శక్తి భయంకరంగా క్షీణించిపోతుంది. మెదడుకు చురుకుతనం తగ్గిపోతుంది.



- -- అపరిశుభ్రత, మత్తు పదార్థాల సేవనం వంటివి ఆరోగ్యాన్ని దెబ్బ తీస్తాయి.
- -- భయపడటం, ఆవేశ పడటం లాంటి ఒడిదుడుకుల వల్ల మనోవికారాలు తలెత్తుతాయి. అవి మనిషిని బలహీనం చేసి రోగగ్రస్తునిగా చేస్తాయి.

శరీరమును రోగరహితంగా ఉంచుకోవడం కష్టమైన పనేమీ కాదు.

- ఆహారము, శ్రమ, విశ్రాంతి అనేవి సమపాళ్ళలో ఉంటే ఆరోగ్యము, దీర్ఘ జీవనము సహజంగానే లభిస్తాయి.

శరీర ఆరోగ్యానికి ముఖ్య ఆధారము ఆత్మ సంయమనము, నియమిత పద్ధతులు. వాటిని నిర్లక్ష్యం చేసి, మందుల ద్వారా ఆరోగ్యాన్ని పొందాలనుకోవడం ఎండమావుల వెంట పరిగెత్తడమే అవుతుంది.

- అవసరం ఏర్పడినప్పుడు ఊత కర్రవలె మందులు వాడాలికాని, నడవటానికి మాత్రం కాళ్ళనే ఉపయోగించాలి.
- శరీరానికి దేవాలయానికి ఇచ్చినంత విలువను ఇవ్వాలి. శరీరాన్ని స్వచ్ఛంగా, ఆరోగ్యంగా, సమర్థవంతంగా తయారుచేయడం మనకు లభించిన పుణ్య కర్తవ్యంగా భావించాలి.
- ఉపవాసం ద్వారా రుచులు, అతిగా ఆహారం స్వీకరించుట వంటి దురలవాట్ల మీద నియంత్రణ సాధించాలి.
- -- మౌనము, బ్రహ్మచర్యము ద్వారా జీవనీశక్తి క్షీణించకుండా కాపాడుకోవాలి.
- -- మనస్సును అంతర్ముఖం చేసే ప్రయత్నం చేయాలి.
- -- శ్రమ పడటం అనేది జీవన చర్యలో ఒక భాగమై పోవాలి.

కొద్దిగా మనస్సు పెట్టగలిగితే ఇవన్నీ సాధించడం సులభమే.

## 3 మనస్సును దురాలోచనలు, దుర్వ్యసనాల నుండి రక్షించుకొనుటకై నిరంతరము స్వాధ్యాయ - సత్సంగాలను ఏర్పాటు చేసుకుంటాము

మానవుడు శరీరం విషయంలో వలెనే మనస్సుకు సంబంధించి కూడా తప్పులు చేస్తూవుంటాడు.

శరీర అలంకరణకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చి, - దాన్ని ఆరోగ్యంగా, రోగ రహితంగా, శక్తివంతంగా తయారు చేసుకోవాలనే విషయాన్ని మర్చిపోతాడు.

అదే విధంగా ప్రజలు మనస్సుకే ఎక్కువ విలువ ఇచ్చి, దాని ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తూవుంటారు. కానీ మనోబలాన్ని పెంచుకోవడం మీద, మనస్సును స్వచ్ఛంగా, సంస్కారవంతంగా తయారు చేసుకోవడం మీద దృష్టి పెట్టరు.

ఈ తప్పు వలన అడుగు అడుగునా తలదించుకోవాల్సి వస్తుంది.

✣ ఆరోగ్యకరమైన శరీరములో వికృతమైన మనస్సు ఉండటం వలన ఆడంబరములకు పోవడం, అహంకారమును ప్రదర్శించడం, ఇతరులను పీడించడం అనే నికృష్టమైన పనులు జరుగుతాయి.

-- గూండాలు, రౌడీలు మొదలైన వారితో ఉండే అపరాధ ప్రపంచంలో జరిగేదంతా ఈ అనారోగ్యకరమైన మనస్సు తెచ్చిపెట్టే ఉపద్రవమే.

మనస్సు మంచి వైపు మలచబడితే ఆత్మోన్నతి, ఆత్మ వికాసము అనే అనే అంశాలపై అభిరుచి పెరిగి జీవితంలో ఎన్నో చమత్కారాలు జరుగుతాయి.

చెడు ఆలోచనలు, దుర్భావనలు వల్ల మనస్సు మురికిగా, మలినంగా మారి పతనావస్థకు చేరుకుని, తన విశేషతలను, విశిష్టతలను కోల్పోతుంది. ఈ స్థితి రాకుండా ముందు జాగ్రత్త వహించడమనేది చాలా అత్యవసరం.



శరీరానికి భోజనము ఎంత అవసరమో, మనస్సుకు సరైన మార్గమును చూపించుటకు స్వాధ్యాయము కూడా అంతే అవసరం.

✣ ఆత్మ నిర్మాణము మొదలుకొని జీవితములోని సమస్యలు అన్నింటికీ సులువుగా పరిష్కారమును సూచిస్తూ,
విశిష్ట ఆలోచనలను మనకు అందించ గలిగే పుస్తకములను పూర్తి శ్రద్ధతో చదివి మననము, చింతనము చేయటనే "స్వాధ్యాయము" అంటారు.

-- ఇటువంటి పరిష్కృత ఆలోచనా విధానము,
జీవన విద్య గురించి తెలిసిన మహనీయులు కనుక మనకు లభిస్తే,
వారితో "సత్సంగము" చాలా ఉపయోగకరంగా ఉంటుంది.

శ్రీ అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్ళగలిగే ఆలోచనాధార "స్వాధ్యాయము మరియు సత్సంగము" ద్వారానే సాధ్యమౌతుంది.

✣ ఈనాటి పరిస్థితులలో స్వాధ్యాయమే అన్నింటికంటే సరళమైన సాధనము.

-- దీని ద్వారా దూరంగావున్న, స్వర్గస్తులైన మహాపురుషులతో సత్సంగము అనేది సాధ్యమౌతుంది.

ఉన్నత స్థాయి ఆలోచనాధార లేకుండా ప్రగతి పథంలో ముందుకు సాగేందుకు ప్రేరణకాని, అంతఃకరణ శుద్ధి కాని లభించదు.

✣ స్వాధ్యాయము మరియు సత్సంగములు ఆలోచనలను మారుస్తాయి.

-- అందువల్ల స్వాధ్యాయము అనేది సాధనలోని ఒక భాగంగా భావించి, మన రోజువారీ కార్యక్రమాల్లో దానికి స్థానం కల్పించుకోవాలి.

ప్రతీవారు భోజనానికి ముందు సాధన చేయడం, పడుకునే ముందు స్వాధ్యాయము చేయడం అనేది తప్పని సరిగా పాటించాలి.

✣☆✣

## 4 ఇంద్రియ సంయమం, అర్థ సంయమం, సమయ సంయమం మరియు ఆలోచనా సంయమాలను నిరంతరమూ అభ్యసిస్తాము

మానవునిలో ప్రోగుపడ్డ కుసంస్కారాలను తొలగించేందుకు తోడ్పడే నియమాలను దైనందిన జీవితంలో పాటించేందుకు అవసరమైన సాహసాన్ని, ఉత్సాహాన్ని ఎవరికి వారే తెచ్చుకోవాలి.

✣ ఈ విధంగా ఎవరిని వారు సంస్కరించుకోవడమే "సంయమము".

సంయమము, సంఘర్షణ అనేవి రెండూ ఒకదానికొకటి పర్యాయ పదాలు.

☝ సంయమనము లేకుండా జీవించడము వల్ల ఎదురయ్యే దుష్పరిణామాలను అర్థము చేసుకోగలిగితే దుఃఖము, దారిద్ర్యము అనేవి అంతమైపోయి "పృథ్వి మీద స్వర్గము" అవతరిస్తుంది.

✣ జీవితములో సంపదలతో నిండిన క్షేత్రాలు నాలుగు ఉన్నాయి.

1. ఇంద్రియ శక్తి, 2. సమయశక్తి, ఆలోచనా శక్తి, 4. ధన (సాధనా)శక్తి.

మొదటి మూడు ఈశ్వరునిచే ప్రసాదింపబడతాయి. నాల్గవది సాధించాలి అంటే భౌతిక జగత్తులో ఈ మూడింటిని కలిపి ప్రయత్నిస్తేనే సాధ్యమౌతుంది.

① పది ఇంద్రియాలలో రెండు ముఖ్యమైనవి. 1. జిహ్వ, 2. జననేంద్రియము.

-- ఈ రెండింటిపై ఎవరు విజయం సాధించగలుగుతారో,
వారికి శారీరిక, మానసిక ఆరోగ్యము లభించినట్లే.

-- జిహ్వను నియంత్రించడం వల్ల శారీరిక ఆరోగ్యము,
జననేంద్రియాన్ని నియంత్రించడం వల్ల అపరిమితమైన మనోబలము లభిస్తాయి.



② సమయము అనేది ఈశ్వరుడు మనకు ప్రసాదించిన ఇంకొక సంపద. సమయమును శ్రమ ద్వారా మాత్రమే సద్వినియోగం చేయగలము.

-- సమయమును శ్రమతో మనస్సును లగ్నము చేసి, ఎన్నో రకాల సంపదలు, విభూతులు సంపాదించేందుకై వినియోగించాలి.

సమయాన్ని మామూలుగా గడిపివేసే వ్యక్తి జీవితాన్ని వృథాగా గడిపినట్లే.

③ ఆలోచనా ప్రవాహమును కూడా సత్ప్రయోజనాలలో లగ్నము చేయాలి.

వ్యక్తి చేసే ప్రతి పనీ ఆలోచనల యొక్క పరిణామమే.
"ఎవరు ఎలా ఆలోచిస్తారో, వారు అలానే చేస్తారు."

ఆలోచనలను నిరుపయోగమైన చింతనలతో వ్యర్థ పరచకుండా, ఉపయోగకరమైన దిశ వైపుకు మరల్చేందుకు ప్రతిక్షణం ప్రయత్నిస్తూనే ఉండాలి.

④ శ్రమతో, మనోయోగంతో చేసే పనికి ప్రత్యక్షంగా మనకు లభించే ప్రతిఫలం "ధనం". ఈ ధనాన్ని అపవ్యయం చేయకూడదు.

ఎవరు ధనమును సద్వినియోగం చేస్తారో,
వారి ఇంట లక్ష్మీదేవి కళ కళ లాడుతూ తిరుగుతుంది.

ఆడంబర వివాహాలు, అహంకార ప్రదర్శనలు, విలాసాలు కొరకు చేసే అనవసరపు ఖర్చుల వల్ల ధనం సద్వినియోగం కాదు.

ఇటువంటి ఖర్చుల వల్ల సామాజిక నేరాలు ఎక్కువౌతాయి.
ఈ కారణంగానే కుటుంబ కలహాలు, బల ప్రదర్శనలు ఎక్కువౌతాయి.

సంయమంతో వ్యవహరించకపోతే, చీకటి రాత్రిలో చక్కటి బాట అనుకుని ఊబిలో కూరుకుపోవలసి వస్తుంది.

✣☆✣

## 5 మమ్ము మేము సమాజము యొక్క
## అభిన్న అంగముగా గుర్తుంచుకుని,
## అందరి హితములోనూ మా హితాన్ని చూసుకొంటాము

☆ సామాజిక న్యాయము అనేది ఖండించేందుకు వీలులేని ఒక సిద్ధాంతము.
దీనిని ఒక్క క్షణం కూడా మరువకూడదు.

ఒక వర్గానికి అన్యాయం జరిగితే,
రెండవ వర్గం ప్రశాంతంగా జీవించడం అనేది అసాధ్యం.

☆ వంద చేతులతో సంపాదించు. మంచిందే!
కానీ దానిని వెయ్యి చేతులతో తప్పని సరిగా దానం చేయాలి.

***సామాజిక న్యాయము అంటే,***

ప్రతి వ్యక్తి శక్తివంచన లేకుండా ఉత్పాదన చేయాలి.
కానీ లాభమును ఇతరులతో కలిసి పంచుకోవాలి.
అందరూ కలిసి తినాలి, జీవించాలి. జీవించనివ్వాలి.
అప్పుడే సమాజంలో వైషమ్యాలు పొడచూపకుండా ఉంటాయి.

సామూహిక స్వార్థము కొరకు వ్యక్తిగత స్వార్థమును త్యజించడమే పుణ్యము అని, పరమార్థము అని అంటారు.

☆ ఈ నీతిని పాటించిన మానవులు మహాపురుషులుగా మారతారు.

-- లోకహితము కొరకు అవసరమైన బాధ్యత తీసుకొని తమ దేశము, సమాజమునకు ఉజ్జ్వల భవిష్యత్తును అందిస్తారు.

ముక్తికి, స్వర్గానికి కూడా ఇదే రాజమార్గము.

☆✡☆



## 6 మర్యాదలను పాటించి, చేయకూడని పనులను చేయము
## పౌర బాధ్యతలను పాటిస్తాము
## సమాజం యెడల నిష్ఠను కలిగి ఉంటాము

ఇతర ప్రాణులతో పోలిస్తే పరమాత్మ మనిషికి విశేషమైన బుద్ధిని, శక్తిని ఇచ్చాడు. ప్రపంచంలో ఉన్న శక్తులు అన్నింటిలో బుద్ధిశక్తి చాలా గొప్పది. ఈ బుద్ధి శక్తి ప్రదర్శించే చమత్కారములే మానవజాతి ఎదుగుదలకు కారణం.

☆ ఇంత గొప్ప శక్తిని ఇచ్చిన పరమాత్మ మానవునికి కర్తవ్యము, ధర్మము అనే కొన్ని బాధ్యతలను కూడా ఇచ్చాడు.

శక్తివంతమైన తత్త్వములు అన్నింటిపైనా నియంత్రణ అనేది చాలా అవసరం. అలా చేయకపోతే ఆ వస్తువుల వల్ల ఎన్నో అనర్థాలు జరుగుతాయి.

పరమాత్మ కూడా మానవ శరీరధారులు అందరి పైనా ధార్మిక కర్తవ్యములు అనే బాధ్యతలను మోపి నియంత్రించకపోయినట్లయితే, మనిషి ఈ సృష్టిలో అన్నింటికంటే భయంకరమైన అనర్థములను కలుగజేస్తాడు.

అందుచేతనే నియంత్రణ అనేది చాలా అవసరమైన అంశము.
కనుక మర్యాదలను పాటించడమనేది మానవుని నిజమైన కర్తవ్యం.

సదాచరణ, కర్తవ్యపాలన అనేవి ధర్మ కార్యాలుగా, పుణ్య కార్యాలుగా చెప్పబడతాయి. వాటిని అనుసరించే ప్రజలే శాంతిని, ప్రసన్నతను అనుభవిస్తారు.

మన ఆచరణ ద్వారానే సమాజంలో ఆరోగ్యకరమైన పరంపరలు వ్యాప్తిలోకి వస్తాయి. అందుచేత క్రమశిక్షణ కలిగిన పౌరులవలె మనం సరిగా జీవిస్తూ, ఇతరులకు కూడా ప్రేరణను ఇవ్వాలి.

☆✡☆

## 7 వివేకము, నిజాయితీ, బాధ్యత మరియు పరాక్రమాలను జీవితం యొక్క అవిచ్ఛిన్నమైన అంగాలుగా గుర్తిస్తాము

సుసంస్కారమునకు 4 ఆధారములు ప్రముఖమైనవిగా చెప్పబడ్డాయి. అవి, 1. వివేకము, 2. నిజాయితీ, 3. బాధ్యత, 4. పరాక్రమము.

✡ శరీరమునకు ఆహారము, జలము, వస్త్రము, నివాసము ఎలా అనివార్య మైన అవసరాలో, అదే విధంగా ఆధ్యాత్మికతకు, అంతరిక శ్రేష్టతకు ఇవి నాలుగు అనివార్యమైన సాధనములు.

① "వివేకము" అంటే దూరదృష్టితో కూడిన ఆలోచనను అలవర్చుకోవడము.

దూరదృష్టి, వివేకము అనేవి అనుభవజ్ఞుడైన రైతు యొక్క గతి విధుల వంటివి. రైతు పొలం దున్నడం, విత్తులు నాటి, నీరు పెట్టి జాగ్రత్తగా చూసుకోవడం లో మొదట్లో చాలా కష్టనష్టాలను భరించవలసి వస్తుంది. వాటి ఫలితం సమయా నుసారం లభిస్తుంది అని తెలుసుకోవడాన్నే "దూరదృష్టి" అంటారు.

తరువాత ఒక విత్తనమునకు బదులుగా వంద విత్తనాలు మొలకెత్తి, సమయానుసారంగా ధాన్యాగారం నిండడం అనే ఫలితం మనకు లభిస్తుంది.

✡ ఆధ్యాత్మిక పరిభాషలో వివేకమును "తృతీయ నేత్రము" అని చెబుతారు.

-- దీని ఆధారముగానే విపత్తుల నుండి బయటపడటం, ఉజ్జ్వల భవిష్యత్తును సృష్టించుకోవడం సాధ్యమౌతుంది.

② సుసంస్కారము యొక్క రెండవ లక్షణము "నిజాయితీ".

-- చెప్పేది, చేసేది ఒకటిగా ఉంచుకోవడమే నిజాయితీ.



✡ దీనిని ఆచరించగలిగితే ఎంత తక్కువ స్థితిలో ఉన్నా, ఉన్నత స్థితికి ఎదిగి విజయాలను సాధించవచ్చు.

-- పెద్ద పెద్ద బాధ్యతలను నిర్వహించడంలో నిజాయితీగా ఉండేవారే సఫలీ కృతులౌతారు.

నిజాయితీ పరుల యొక్క పేదరికం కూడా చాలా వైభవంగా ఉంటుంది. వారి వైభవం ముందు డబ్బున్నవారి ఖజానా కూడా వెలవెలపోతుంది.

③ సంస్కారము యొక్క మూడవ అంగము "బాధ్యత". మానవుడు అనేక రకాల బాధ్యతలతో బంధింపబడివుంటాడు.

✡ ఉదరపోషణ, సంతానము మాత్రమే మానవుని హద్దులు కావు.

-- ధర్మము, సంస్కృతి, విశ్వమానవత పట్ల కూడా మానవునికి సామాజికమైన, సార్వభౌమికమైన బాధ్యతలు ఎన్నో ఉన్నాయి.

-- తమ వ్యక్తిగత స్వార్థమును కొంతైనా తగ్గించుకుంటేనే ఈ బాధ్యతలు అన్నింటినీ నిర్వహించేందుకు వీలౌతుంది.

④ సుసంస్కారము యొక్క నాల్గవ అంగము "పరాక్రమము".

నిత్య జీవితంలో మనకు ఎన్నో సమస్యలు ఎదురౌతూవుంటాయి. వాటినన్నింటినీ ఎదిరించి నిలబడటానికి పరాక్రమం కావాలి.

ముందుకు సాగాలన్నా, ఉన్నత స్థితికి ఎదగాలన్నా సంఘర్షణ అనేది తప్పదు. కుసంస్కారాలు మన గుణకర్మ స్వభావాలలోకి లోతుగా చొచ్చుకొనిపోయి ఉండటం వలన, వాటితో మహాభారతమంతటి యుద్ధం చేయాలి.

సర్వతోముఖమైన ప్రగతిని పొందాలి అంటే, సుసంస్కారాలను పెంచు కునేందుకు పరిపూర్ణమైన ప్రయత్నాలు చేస్తూనే ఉండాలి.

✡❀✡

## 8 నలువైపులా మాధుర్యము, స్వచ్ఛత, సౌజన్యము, నిరాడంబరతతో కూడిన వాతావరణాన్ని నిర్మిస్తాము

❀ ఇతరుల దృష్టిలో మనం చాలా మంచివారమని, మృదువైన ప్రవర్తన కలవారమని, శ్రేష్ఠ మానవుల వంటి ఆచరణను, వ్యక్తిత్వమును తీర్చిదిద్దుకున్నామని అనిపించినప్పుడే మనం మానవత్వము యొక్క ప్రథమ పరీక్షలో ఉత్తీర్ణులమైనామని భావించాలి.

-- ఆ తరువాతనే నైతికత, సేవ, ఉదారత, సంయమము, సదాచారము, పుణ్య పరమార్థముల వైపు అడుగులు వేయాలి.

మధురమైన సంభాషణ, వినమ్రతతో కూడిన మృదువైన వ్యవహారము, స్వచ్ఛత అనేవి మనం తప్పకుండా పాటించవలసిన నియమాలు.

ఇటువంటి మంచి విషయాలు అలవాటు అవడం వల్ల సౌందర్యముతో నిండిన ఈ ప్రపంచములో భగవానుని కళానైపుణ్యాన్ని చూసి ఆనందంతో పులకరించడమెలాగో అర్థమౌతుంది. అప్పుడు మాత్రమే మనం పూర్ణత్వము అనే లక్ష్యం వరకూ చేరుకోగలుగుతాం.

❀ నిరాంబరత వలన వినమ్రత, మంచితనము అభివృద్ధి చెందుతాయి.

-- ఎవరి వేషభాషలు నిరాండంబరంగా ఉంటాయో, వారిని అత్యంత ప్రామాణిక వ్యక్తులుగా, విశ్వసించదగిన వారిగా భావించాలి.

మనం అనుసరించే నిరాడంబర వేషధారణ మన యొక్క స్వతంత్ర ప్రతిభను, స్వతంత్ర చింతనను తెలియజేస్తూ ఉంటుంది.

❀✻❀



## 9 అవినీతితో పొందిన సాఫల్యము కంటే నీతి మార్గాన పొందిన పరాజయాన్నే శిరసావహిస్తాము

సాఫల్యం కంటే నీతి చాలా ఉన్నతమైనది.

నీతిమార్గంలో నడుస్తూ పరిస్థితుల ప్రాబల్యం వల్ల అపజయం కలిగినా, అది కూడా గౌరవించదగినదిగానే ఉంటుంది.

శివాజీ, రాణా ప్రతాప్, గురు గోవిందసింహ్, లక్ష్మీబాయి, సుభాష్ చంద్ర బోస్ మొదలైన వారంతా ఎన్నోసార్లు ఓటమిని ఎదుర్కొన్నారు. కానీ వారికి ఆ పరాజయం విజయం కంటే చాలా విలువైనది.

ధర్మము, సదాచారాలపై దృఢంగా నిలబడాలనుకునేవారు విజయము నందుకాక, కర్తవ్యపాలన యందు శాంతిని అనుభూతి చెందుతారు.

❀ అవినీతి, పరాజయం ఈ రెండింటిలో ఏదో ఒకదాన్నే ఎంచుకోవలసి వస్తే, అవినీతిని కాకుండా అపజయాన్నే కోరుకోవాలి.

నీతి మార్గాన్ని వదిలివేసి, సదుద్దేశ్యాలను పూర్తిచేయలేము.

రాణాప్రతాప్‌కు అక్బర్ ఒక సందేశం పంపించాడు. "మీరు మాతో శత్రుత్వం వదిలేసి స్నేహం చేస్తే, అడవులు పట్టి తిరగవల్సిన అవసరం ఉండదు. మీ రాజ్యం మీకు ఇచ్చేస్తాను." ఇదీ దాని తాత్పర్యం.

ఈ ప్రలోభానికి రాణాప్రతాప్ లొంగలేదు. "మా ధర్మాన్ని రక్షించుకునే విషయంలో ప్రాణం ఇవ్వవలసి వచ్చినా మేము వెనుకాడం" అని చెప్పి అతని ప్రలోభానికి లొంగలేదు.

❀✻❀

## 10 వ్యక్తి విలువకు గీటురాయి అతని సాఫల్యము, యోగ్యత, అంతస్తులు కాక, అతని సద్భావనలు, సత్కర్మలు అని గుర్తిస్తాము

కళ్ళు మూసుకుపోయిన ప్రజానీకం విజయం సాధించిన వారిని ప్రశంసిస్తారు. అపజయం పొందిన వారిని తక్కువ దృష్టితో చూడటం వల్లనే వారు రోషపడి విజయం సాధించేందుకు అవినీతిని చేసేందుకు వెనుకాడటం లేదు.

నీతి మార్గంలో, సదాచారంతో ధనమును సంపాదించిన వారికే ఆదరణ లభించాలి. అధర్మ మార్గంలో నడుస్తూ, అవినీతితో ధనవంతులుగా మారిన వారిని ఆదరిస్తే వారిలో ఉన్న ఆ అపరాధ ప్రవృతికి ప్రోత్సాహం లభిస్తుంది.

✳ ఇతరులను సన్మార్గంలో నడిపించేందుకు, దుర్మార్గాల నుండి దారి మళ్ళించేందుకు మన దగ్గర ఉన్న సాధనం ఏమిటంటే, "ఆదరించడం, నిరాదరించడం."

✳ ఎవరైతే బాధలను సహిస్తూ కూడా తమ జీవితాలను ఆదర్శాలకు అంకితం చేస్తారో, వారికి అంతటా గౌరవం లభించాలి.

-- ఎవరైతే తప్పుడు మార్గంలో ఉన్నతిని సాధిస్తారో, వారికి ఎలాంటి తోడ్పాటు, ప్రశంసలు లభించకుండా చేయాలి.

మనం వ్యక్తి విలువను అతని సాఫల్యాలు, సంపదల ద్వారా కాక, అతని యొక్క సత్కర్మలు, సదాలోచనల ద్వారానే గుర్తించాలి.

ఉన్నత ఆదర్శాలను రక్షిస్తూ, జీవితాంతం వాటిని ఆచరిస్తూ, ఎలాంటి విపత్కర పరిస్థితుల్లోనైనా వాటిని విడిచిపెట్టని వ్యక్తియే అభినందనీయుడు.

✳✳✳



## 11 ఇతరులు మాయెడల ఏ విధంగా ప్రవర్తించాలని కోరుకుంటామో, మేము ఇతరుల యెడ ఆ విధంగానే ప్రవర్తిస్తాము

ఇతరుల మన పట్ల మంచిగా, ఉదారంగా, మధురంగా వ్యవహరించాలని కోరుకుంటాం. వారు మన ప్రగతికి సహాయపడుతూ, మన ప్రశాంతతకు, సౌకర్యానికి ఆటంకం కలిగించే పనులేవీ చేయకుండా ఉండాలని కోరుకుంటాం.

సరిగ్గా ఇదే విధంగా ఇతరులు కూడా మన నుండి ఆశిస్తారు.

✳ ఎవరైనా మనల్ని కఠినంగా, నిష్ఠూరంగా, తూలనాడినట్లుగా అమర్యాదా పూర్వకంగా మాట్లాడితే, మనకు చాలా బాధ కలుగుతుంది.

-- ఈ విషయాన్ని కనుక మనం గుర్తుంచుకుంటే, మన మాటల్లో ఎల్లప్పుడు సౌమ్యత, మాధుర్యము తొణికిసలాడతాయి.

✳ మనకు ఆపద వచ్చినప్పుడు అవతలివారు అనూహ్యంగా సహాయపడాలని కోరుకుంటాము. ఇతరులు ఆపదలో ఉన్నప్పుడు వారు కూడా మన సహాయాన్ని ఆపేక్షిస్తారు అనే విషయం మనకెందుకు గుర్తుండదు?

✳ మనం పెద్దవారిమైపోయినప్పుడు పిల్లలు మనల్ని చూసుకోవాలి, మనకు సేవలు చేయాలి అని ఆశిస్తాము. కానీ మనం ముసలివారైన మన తల్లి దండ్రులతో అనుచిత రీతిలో వ్యవహరిస్తాము.

-- ఇలాంటి ద్వంద్వనీతి వల్ల సత్పరిణామాలు రమ్మంటే ఎలా వస్తాయి?

ఇతరులు మన పట్ల ఎంత స్నేహపూర్వకంగా వ్యవహరించాలని అనుకుంటామో, మనం కూడా ఇతరుల పట్ల అలానే వ్యవహరించాలి.

✳✳✳

## 12 స్త్రీ పురుషులము పరస్పరము పవిత్ర దృష్టిని కలిగి ఉంటాము

✲ పురుషులు స్త్రీల పట్ల, స్త్రీలు పురుషుల పట్ల పవిత్రమైన ఆలోచనలను కలిగివుండటం వల్ల ఆత్మోన్నతిని పొందటమే కాక,
సామాజిక ప్రగతి కలిగి సుఖశాంతులు విలసిల్లుతాయి.

బ్రహ్మచర్య వ్రతమును పాటించేవారు, వివాహం కాని స్త్రీ, పురుషులు అందరూ ఆలోచనల యందు ఒకరి పట్ల మరొకరు పవిత్ర భావమును కలిగి వుండాలి. మిగిలిన వారు కూడా ఇదే దృష్టికోణాన్ని కలిగివుండాలి.

స్త్రీ ఈ ప్రపంచంలో సర్వోన్నతమైన పవిత్రమూర్తి.

✲ తల్లిరూపంలో ఆమె అనంతమైన వాత్సల్యమును తనతోపాటే తీసుకొని ఈ పృథ్విపై అవతరిస్తుంది.

-- భార్య రూపంలో త్యాగమును, బలిదానమును ఇస్తుంది. ప్రేమను అందిస్తుంది. ఆత్మదానము చేసుకున్న సజీవ ప్రతిమగా నిలిచిపోతుంది.

-- సోదరీరూపంలో స్నేహమును, ఉదారతను ప్రదర్శిస్తూ మమతకు మారుపేరుగా నిలిచిపోతుంది.

-- కుమార్తె రూపంలో కోమలత్వమునకు, మృదుత్వమునకు, నిశ్చలతకు ప్రతిరూపంగా నిలిచి, రసవిహీనమైన ఈ ప్రపంచాన్ని రసాత్మకంగా మార్చేస్తుంది.

✲ పరమాత్మ స్త్రీయందు సత్యము, శివము మరియు సుందరములనే అనంతభాండారములను నింపాడు.

-- ఆమె నేత్రముల యందు ఉండే అలౌకికజ్యోతి కిరణాలు కొన్ని పడినంత మాత్రముననే కరుడుగట్టిన హృదయములయందుండే వాడిపోయిన పూదోటలు కూడా తిరిగి పుష్పిస్తాయి.

-- బలహీనులు, అవిటివారైన మానవులను శక్తివంతులుగా, బలవంతులుగా తీర్చిదిద్దగలిగే కీర్తి ఆమెకు మాత్రమే దక్కుతుంది.



✲ వయస్సులో పెద్దవారైన స్త్రీలను తల్లిగాను,
సమవయస్కులైన వారిని సోదరీమణులుగాను,
చిన్నవయస్సున్న వారిని కూతురుగాను భావించాలి.

-- ఆ భావనలను అధికాధికంగా పెంచుకుంటూ ఉండాలి.

-- అప్పుడు వారి సమక్షములో కూర్చున్నప్పుడు సరస్వతీ, లక్ష్మీ, దుర్గామాతల చరణముల వద్ద కూర్చుని వారి అనంత వాత్సల్యమును ఆనందంగా అనుభూతి చెందుతున్న ఆహ్లాదకరమైన భావన కలుగుతుంది.

గాయత్రీ ఉపాసకులమైన మనము స్త్రీని భగవంతుని యొక్క అత్యున్నతమైన, సర్వశ్రేష్ఠమైన ప్రతిరూపంగా భావించాలి.

✲ స్త్రీయందు భగవంతుని కరుణ, పవిత్రత, సదాశయములను దర్శించడము అనేది భక్తిభావన అనే తత్త్వమునకు అధారము.

ఉపాసనయందే కాదు వ్యావహారిక జీవితములో కూడా ఇదే విధమైన దృష్టికోణమును కలిగివుండాలి. స్త్రీలందరినీ మనం పవిత్రదృష్టితోనే చూడాలి. కోరికలతో నిండిన దృష్టితో ఆమెను చూడవద్దు. ఆమెను తాకవద్దు.

యుగనిర్మాణ సత్సంకల్పాల్లో "ఆత్మవత్ సర్వభూతేషు, పరద్రవ్యేషు లోష్టవత్, పరదారేషు మాతృవత్" అనే పవిత్రభావాలు నిండివున్నాయి. వీటి ఆధారంగానే నవయుగము సృష్టించబడుతున్నది.

✲✲✲

## 13 ప్రపంచములో సత్ప్రవృత్తుల పుణ్య ప్రచారము కొరకు మా సమయము, శ్రమ, పలుకుబడి సాధ్యమైనంతగా వెచ్చిస్తాము

✷ ప్రపంచంలో ఎన్ని సత్కార్యాలైతే జరిగాయో,
వాటి అన్నింటి మూలములో సత్ప్రవృత్తులే పనిచేస్తున్నాయి.

విత్తనాలు అనేవి ఉంటేనే కదా కళకళలాడే పచ్చని పొలం ఉంటుంది. విత్తనమే లేకుండా మొక్కలెలా పెరుగుతాయి?

అదే విధంగా మంచి, చెడు పనులనేవి వాటంతట అవే జరగవు. ఎప్పటి నుండో వాటి మూలముల యందు సదాలోచనలు, దురాలోచనలు అనేవి పోగు పడి ఉంటాయి. సమయం వచ్చినప్పుడు అవి మొలకెత్తి పుష్పించి ఫలిస్తాయి.

✷ ఆ ప్రకారంగా మొలకెత్తే సత్ప్రవృత్తులు ఎన్నో రకాలైన పుణ్యకార్యాల ద్వారా, పారమార్థిక కార్యాల ద్వారా ప్రోదిచెందబడుతూ ఉంటాయి.

సత్ప్రవృత్తులను అత్యధికంగా పెంపొందింప చేస్తేనే వ్యక్తులకు, సమాజానికి శుభం చేకూరుతుంది. ఇలా ప్రయత్నించిన వారిలో ప్రాచీన కాలానికి చెందిన వ్యక్తులు ఇవి తమ జీవితాలను ఉన్నత స్థితిలో నిలిపాయని పేర్కొన్నారు.

అందుచేత సమయము, పలుకుబడి, జ్ఞానము, ధనము అనే విభూతులను మనిషి ఎక్కువ భాగం పరమార్థ ప్రయోజనముల యందే వినియోగించాలి.

✷ ప్రతి వ్యక్తి ప్రతిరోజు ఒక గంట సమయము లేదా వారానికి ఒక రోజును సత్ప్రవృత్తుల సంవర్ధన అనే బృహత్తర కార్యక్రమము కొరకు వినియోగించ గలిగితే, వారి పేర్లు చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడతాయి.



## 14 సాంప్రదాయాల కంటే వివేకానికి ప్రాముఖ్యతనిస్తాము

సామాజికపరమైన కురీతుల వల్ల హిందూ సమాజం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. వివేకము మూఢాచారాల చేతిలో ఓటమి పాలైంది.

మూఢాచారమనే మేక, వివేకము అనే సింహపు మెడను పట్టుకొని కొరికినట్లు ఈ సాంప్రదాయాల తుపానులో వివేకము కొట్టుకుపోతున్నది.

✷ చక్కని ఆలోచనా విధానం లేకపోవడమే ఈ సమస్యలకు కారణం. వివేకం అనేది అంతఃకరణలో ఉదయిస్తే ఈ దురాచారాలు తొలగిపోతాయి.

మన ఆలోచనల యందు బుద్ధి వికసించేకొద్దీ వివేకము కూడా జాగృతమౌతుంది.

కొన్ని మూర్ఖత్వాలు, నీతి నియమాలు లేకపోవడం, గ్రుడ్డి సంప్రదాయాలు మన సామూహిక జీవితంలోకి ప్రవేశించాయి. అవి చాలా లోతుగా పాతుకొని ఉన్నట్లు, వాటిని పీకడం చాలా కష్టమని అనిపిస్తుంది.

కానీ వివేకవంతులు కొద్ది మంది అయినా సరే సంఘటితమై వ్యతిరేకించ గలిగితే, ఈ దురాచారాలన్నీ ఒక సామాన్యమైన ఘర్షణకే పిండిపిండైపోతాయి.

ఒకసారి డబ్బులు తగ్గిన కారణంగా వివేకానంద, రామకృష్ణ పరమహంస ఆశ్రమం యొక్క భూమిని అమ్మేందుకు సిద్ధపడ్డారు. అప్పుడు ఒక శిష్యుడు "స్వామీ! మీరు ఇప్పుడు గురు స్మారకాన్ని అమ్మేస్తారా?" అని అడిగాడు.

అప్పుడు వివేకానందుడు "మందిరాలను ప్రపంచము యొక్క మంచి కొరకు స్థాపిస్తారు. వాటిని అమ్మడం కూడా మంచి పనికి ఉపయోగపడితే, అలా చేయడంలో తప్పేముంది?" అన్నారు.

## 15 సజ్జనులను సంఘటిత పరుచుటలో, అవినీతి యెడల కాఠిన్యత వహించుటలో, సృజనాత్మక కార్యకలాపాలలో పూర్తి ఆసక్తిని కలిగి ఉంటాము

- సౌమ్యమైన తత్త్వములను కనుసైగతోనే అర్థమయ్యేలా వివరించి వివేకము, తర్కము ద్వారా ఆ తత్త్వము యొక్క గొప్పతనాన్ని వివరించి ప్రజలు సన్మార్గములో నడిచేందుకు తోడ్పడవచ్చు.

-- కానీ దుర్మార్గపు తత్త్వములను మార్చాలంటే,
ఇనుమును కొలిమిలో కాల్చి సాగగొట్టినంత ప్రయత్నము చేయకతప్పదు.

దుర్యోధనుడిని బుజ్జగించాలని శ్రీకృష్ణుడు రకరకాలుగా ప్రయత్నించాడు. కానీ సఫలం కాలేకపోయాడు. ఇక అప్పుడు అతడిని సరైన మార్గంలోకి లాగేందుకు అర్జునుని ద్వారా బాణప్రయోగం చేయకతప్పలేదు.

- సాధుస్వభావమున్న పశువులకు చెప్పినట్లుగా పొగరుగిత్తలకు చెప్పాలంటే కుదరదు. వాటికి సున్నితమైన భాష అర్థంకాదు.

-- అందుకని చెర్నాకోలుతోనే వివరించాలి.

భగవంతుడు ధర్మస్థాపన చేసేందుకై మళ్ళీమళ్ళీ అవతారం తీసుకుంటాడు. దానితోపాటే రాక్షసనిర్మూలన చేసేందుకై రౌద్రకృత్యాలు కూడా చేస్తాడు.

ఈనాడు నైతిక, భౌతిక, సామాజిక రంగాలయందు అవాంఛనీయ తత్త్వాలు విపరీతంగా పెరిగిపోయాయి. అక్కడ శాంతిని, సువ్యవస్థను నెలకొల్పడమనేది ఒక పెద్ద సమస్యగా తయారైంది.

మోసము, అసత్యము, నమ్మక ద్రోహము అనేవి ఎంత విపరీతంగా పెరిగిపోయాయి అంటే, ఎవరిని నమ్మాలన్నా ప్రమాదకరంగానే అనిపిస్తున్నది.



ఈనాడు మనిషి యొక్క ఆలోచనలు చాలా నీచంగా, స్వార్థపూరిత స్థాయికి దిగజారిపోయి చాలా హీనస్థితికి చేరుకున్నాయి.

- ఉదరపోషణ, సంతానము తప్ప ఎవ్వరికీ మరో లక్ష్యమనేది లేదు.

-- ఆదర్శవాదము, ఉన్నతమైన జీవిత విధానము వంటి పదాలు చెప్తే వినేందుకు మాత్రమే పనికొస్తున్నాయి.
ఆచరణయోగ్యమైనవిగా ఎవరూ భావించడం లేదు.

సామాజికపరమైన చెడు సాంప్రదాయాల గురించి చెప్పవల్సిన అవసరమే లేదు. వివాహములనేవి ఉన్మాదములుగా మారిపోయాయి.

వ్యక్తిగత, సామాజిక, రాజనైతిక క్షేత్రాలయందు వ్యాపించిన అసంఖ్యాకమైన దుష్ప్రవృత్తులకు వ్యతిరేకంగా ఒక విస్తృతస్థాయిలో సంఘర్షణ చేయాల్సిందే.

- వివాహం పేరుతో చేస్తున్న ఈ ఆడంబరాలను నిర్మూలించేందుకు మద్దతిచ్చే వారందరినీ ఒకచోట ఏకం చేసి బలమైన ఏకాభిప్రాయానికి రావాలి.

-- పూర్తిగా సాధారణమైన రీతిలో స్వల్పమైన ఖర్చుతో చేసే వివాహాలను ప్రచారంలోకి తీసుకువచ్చేదాకా మన సంఘర్షణ ఆగకూడదు.

- స్వార్థపరులు, అధికార దుర్వినియోగం చేసేవారు సార్వజనిక సంస్థలను తమ సొంత పనులకు అడ్డాలుగా ఉపయోగించుకుంటున్నారు. అలాంటి వాళ్ళందరినీ పాలల్లో పడ్డ ఈగను తీసి పారేసినట్లు తీసి పారెయ్యాలి.

- సాధువుల పేరుతో 80 లక్షల మంది అడుక్కుతినేవారు రకరకాల వేషాలు వేసి, మోసాలు చేస్తూవుంటే ఎంతకాలం సహిస్తూవుంటాము?

అడుగడుగునా అవినీతి, అన్యాయంతో పోరాడడమనే ఈ ధర్మయుద్ధంలో విజయకేతనం ఎగిరేంత వరకు మన పోరాటం ఆగకూడదు.

## 16 దేశ ఐకమత్యము, సమానతల యెడ శ్రద్ధ చూపుతాము జాతి, లింగ, భాష, ప్రాంత, సంప్రదాయాల కారణంగా పరస్పరం ఎలాంటి భేదభావాలను కలిగి ఉండము

- 21 వ శతాబ్దము యొక్క సంపూర్ణ వ్యవస్థ మొత్తం ఏకత్వము, సమత్వము అనే సిద్ధాంతముల మీదనే ఆధారపడివుంటుంది.

-- ప్రతీ రంగమునందు ఈ సిద్ధాంతాలే మనకు కనిపిస్తాయి.

ఆ రాబోయే భవిష్యత్తుకు అనుగుణంగా మన ప్రయత్నాలను మెల్లిగా మొదలుపెడితే మనకే మంచిది. బ్రాహ్మీముహూర్త సమయంలో లేచి నిత్యకర్మలు పూర్తిచేసుకునే వ్యక్తి సూర్యోదయానికల్లా మామూలు పనిలోకి వెళ్ళిపోతాడు. అదే సూర్యోదయమయ్యాక లేచే వ్యక్తి అనేక విషయాల్లో వెనుకబడి ఉంటాడు.

"వసుధైక కుటుంబకమ్" అనే ఆదర్శము ఇప్పుడు సామూహిక వాదంగా మారి, సమయానుకూలంగా కార్యరూపం దాలుస్తున్నది.

- జాతి, మతాల పేరుతో, వర్ణ వ్యవస్థల పేరుతో, లింగభేదాల పేరుతో వేరు కావడం ఆదిమకాలం నాటి మాట.

-- ఇక ప్రపంచమంతటా ఒకే జాతి మనుగడలో ఉంటుంది.
అదే చక్కగా సంస్కరింపబడి సభ్యతను పాటించే మానవజాతి.

- పృథ్వి మొత్తం ఒకే దేశంగా మారుతుంది. దేశాల మధ్య ఏర్పాటైన కృత్రిమమైన అడ్డుగోడలన్నీ ముక్కలై ఎందుకూ పనికిరాకుండా పోతాయి.

రాబోయే సత్యయుగ సమాజ వ్యవస్థకు సంబంధించిన కొన్ని దృశ్యాలివి. ప్రతి ఆస్తికుడికి ఇవి భవిష్యత్తు పట్ల ఆశను కలిగిస్తాయి.



## 17 మానవుడు తన భాగ్యానికి తానే నిర్మాత! ఈ విశ్వాసము ఆధారంగా మేము ఉత్కృష్టులమై, ఇతరులను శ్రేష్ఠులుగా చేస్తే, యుగం తప్పక మారుతుందని మా విశ్వాసం

- ప్రతి మనిషి తన భాగ్యాన్ని తనే స్వయంగా నిర్మించుకుంటాడు.

ఏ విధంగా ముందురోజు తోడుపెట్టిన పాలు మరుసటి రోజుకు పెరుగుగా మారతాయో, అదే విధంగా నిన్న మనం చేసిన పురుషార్థం ఈనాటి మన భాగ్యంగా మన ముందుకు వస్తుంది.

అందువల్ల కర్మను భాగ్యంగా చెప్పుకుంటే అది అతిశయోక్తి కాదు.

- 1. ఆకాంక్ష, 2. విచారణ, 3. భావన, 4. శ్రద్ధ, 5. ప్రవృత్తి, 6. నిష్ఠ, 7. సామర్థ్యము, 8. క్రియ, 9. మర్యాద అనే 9 లక్షణాలతో మన కర్మలు కూడికొని ఉన్నప్పుడు, ఆ కర్మలు మనల్ని ఉన్నతులుగా చేస్తాయి.

ఈ విధంగా మనల్ని ఉన్నతులుగా మార్చుకోగలిగితే మన సంపర్కంలోకి వచ్చే వారిని కూడా ఉన్నతులుగా మార్చవచ్చు.

ఇతరులను మనం ఎంత శ్రేష్ఠులుగా ఉండాలని కోరుకుంటామో, మనం కూడా అంతకంటే కొంచెం ఎక్కువగానే మన ప్రామాణికతను నిరూపించుకోవాలి.

వ్యక్తి నిర్మాణం చేయాలంటే, తీర్చిదిద్దిన వ్యక్తిత్వం ఉన్నవారు కావాలి. ఇందుకు మనమే ముందుకు రావాలి. అప్పుడు మన ఉత్కృష్టతతో పాటు ప్రపంచం యొక్క శ్రేష్ఠత కూడా దానంతట అదే పెరుగుతుంది.

ఈ విధంగా మనం మారితే యుగం మారుతుంది.
మన యుగ నిర్మాణ ప్రణాళిక సత్సంకల్పము సుసంపన్నమై తీరుతుంది.

## 18 "మేము మారతాం - యుగం మారుతుంది
## మేము చక్కబడతాం - యుగం చక్కపడుతుంది"
## ఈ తథ్యముపై సంపూర్ణ విశ్వాసము ఉన్నది

నరక సదృశమైన పరిస్థితులను మార్చి సుఖశాంతులతో కూడిన స్వర్గీయ వాతావరణమును తీసుకువచ్చేందుకు చింతనే (ఆలోచన) ఏకైక మార్గం.

- ఆలోచనల్లో ఉండే ఔన్నత్యము, నీచత్వము వల్లనే
 మనిషి దేవతగానో, అసురుడిగానో తయారౌతాడు.

-- స్వర్గ నరకముల సృష్టి మొత్తం మానవుని చేతిలోనే ఉంది.
 వ్యక్తుల సమూహమును సమాజము అంటారు.
 వ్యక్తులు ఎలావుంటే సమాజము కూడా అలాగే వుంటుంది.
 ప్రజలు ఎలా ఉంటే సమాజము, దేశము కూడా అలాగే తయారౌతుంది.

- దీనులు, దుర్బలులు అయిన ప్రజలతో సమర్థవంతమైన, ఆరోగ్యకరమైన సమాజమును నిర్మించడం సాధ్యపడదు.

ప్రజల మనస్సులు దిగజారిపోయివుంటే ఉన్నతమైన, సమర్థతతో కూడిన వ్యక్తిత్వము ఉన్నవారు నాయకత్వం వహించేందుకు ఎక్కడ నుండి వస్తారు?

**ప్రజల మనస్సుల యందు మార్పు తీసుకురావాలంటే ఒకే ఒక మార్గం వుంది,**

జీవితాలను ఆదర్శాలకు అంకితం చేసేందుకు ముందుకు వచ్చే వీరులతో కూడిన ఒక దళాన్ని తయారుచేస్తే,

వారు తమ ఆచరణ ద్వారా "ఆదర్శాలు అనేవి ఉపన్యాసాలు చెప్పేందుకే కాదు, ఆచరణకు కూడా పనికి వస్తాయి" అని నిరూపించగలరు.



ఈ ప్రతిపాదనను ప్రమాణాలతో సహా నిరూపించేందుకు మనకై మనమే ముందుకు వచ్చి మొదటి వరుసలో నిలబడాలి.

- ఎప్పటికైనా సరే ఆచరణే ప్రమాణంగా నిలబడుతుంది.
 అదే ఇతరులు అనుకరించేందుకు ప్రేరణను ఇస్తుంది.

- ఎవరైతే ప్రజలను రంజింపచేసేందుకు బదులు మేలు చేయాలనుకుంటారో వారు ముందుగా నిందలను భరించాలి.
 అపకీర్తిని, వ్యతిరేకతలను ఓర్పుతో భరించడం నేర్చుకోవాలి.
 అప్పుడే సంస్కరించడము అనే పనిని చేయగలరు.

భౌతిక పరాధీనతకు విరుద్ధంగా విచారక్రాంతి ప్రకటించిన ఈ యుద్ధంలో పాల్గొనే సేనానాయకులు కనీసం నిందలనే దెబ్బలైనా తినక తప్పదు.

- యుగపరివర్తనలో నాయకులు కావాలనుకునేవారు కీర్తి, గౌరవాలను వద్దనుకునేవారై, నిందలను స్వీకరించే సాహసము ఉన్నవారై ఉండాలి.

- ఈనాడు నిజమైన ఆధ్యాత్మికతను ఊహాలోకం నుండి క్రిందికి దింపి, దానిని వ్యావహారిక జీవితంలో ఒక భాగంగా మార్చాలి.

-- లేకపోతే ఆత్మిక ప్రగతి సాధ్యంకాదు.

కోరికలను తీర్చుకోవడంలో, స్వార్థపూరితమైన పనులు చేయడంలోనే మనకున్న కొద్దిపాటి సాహసము, శక్తి ఖర్చయిపోతున్నది.

మనం ఈ భవబంధనాలను త్రెంచివేసి జీవితాన్ని ప్రకాశమయం చేసుకోవాలి.

ఆ కాంతిలో వర్తమానయుగంలోని అంధకారం అంతా పటాపంచలై, ఉజ్వల భవిష్యత్తు యొక్క కాంతులు విరజిమ్ముతూ ఎగసి పడతాయి.

❋✲❋